# కర్మయోగులు

ఏ నాటి మాట! అప్పటికింకా తెల్లదొరతనం సాగుతోంది. చిన్న చిన్న పిల్లలున్న వాళ్ళకి కొత్త ఊరు బదిలీ అయిందన్న వార్త చికాకు కలిగిస్తుంది.

అందులో పనికిమాలిన స్థలంగా అందరూ వర్ణించిన ఊరు పోవాలంటేమరీ బాధ కలుగుతుంది. అప్పట్లో ఆ జిల్లాలో నేనే డబుల్ ఎమ్.ఏ. చదివిన వాణ్ణి.

రాజమండ్రి ట్రైనింగ్ అయి కొన్ని స్థిరమైన నిర్ణయాలతో నా ఉద్యోగ బాధ్యతలు ప్రతిష్ఠాత్మకంగా పెట్టుకుని వస్తున్నాను. క్రమ శిక్షణారాహిత్యం సహించేవాణ్ణి కాను. అందుకే చుట్టూ ఉన్న సమాజంతో ఘర్షణ తప్పేది కాదు.

నే వెళ్ళిన ఊరు అటు పట్నమూ కాదు, ఇటు పల్లెటూరూ కాదు. ఎండా కాలం. నీటి ఎద్దడి అని ముందే విన్నాను. స్థానిక రాజకీయాలు ప్రతి స్కూల్లో కాస్తో కూస్తో ఉండనే ఉంటాయి. స్కూలు విశాలంగానే ఉంది. అన్నీ కలిసి నాలుగు కట్టడాలు దూర దూరంగా

ఉన్నాయి. చుట్టూ ముళ్ళ కంచె. మధ్యలో నీడనిచ్చే ఒక పెద్ద మఱ్ఱి చెట్టూ, రెండు రావిచెట్లూ.

ఊరికి కొత్తగా వచ్చినవాణ్ణి. అక్కడ స్టాఫ్ కూడా ఇది వరకు నాకు పరిచయం ఉన్నవాళ్ళు కారు. 'హెడ్ మాస్టర్' అన్న సైన్ బోర్డు చూసి ఎత్తైన వరండా ఎక్కి గదిలోకి వెళ్ళాను.

గదిలో కుర్చీ ఖాళీగా ఉంది. బల్లమీద కొన్ని పుస్తకాలూ, అటెండెన్స్ రిజిస్టరూ, ఒక వాచీ ఉన్నాయి. ఒక ముసలి అటెండరు నన్ను చూసి 'ఎవరై ఉంటారా' అని అంచనా వేస్తున్నాడు.

అతన్ని పిలిచి-"హెచ్.ఎమ్. లేరా?" అని అడిగాను.

"మొదటి పీరియడ్ క్లాసు తీసుకుంటున్నారు బాబు" అంటూ ఇంకో కుర్చీ తెచ్చి ఎదురుగా వేశాడు.

గోడకున్న గ్రూప్ ఫోటోలూ, అద్దాల బీరువాలో అమర్చి ఉన్న వెండి కప్పులూ చూస్తూ కూర్చున్నాను.

పావుగంట దాటింది. తెల్లగా పండిన బుగ్గమీసాలూ, అంత కన్నా తెల్లని లాల్చీ, పంచె, వోణీతో ఆజానుబాహుడు హడావిడిగా గదిలోకి వచ్చాడు.

నేను తక్షణమే నిల్చి - "నమస్కారం" అని నన్ను పరిచయం చేసుకున్నాను. అతను అటెండెన్స్ రిజిస్టరులో చిన్న సంతకం చేసి- "హెచ్.ఎమ్. కి మొదటి పీరియడ్ క్లాసు ఉండి ఉంటుంది. కూర్చోండి" అని వెళ్ళిపోయాడు.

కాసేపటికి గంట కొట్టి లోనికి వచ్చిన ముసలి అటెండర్ని పిలిచి - "నీ పేరు ఏమిటి?" అని అడిగాను.

"దాలయ్య బాబూ" అన్నాడు.

"ఇప్పుడు వచ్చి వెళ్ళిన మీసాలాయన ఎవరు?" అన్నాను.

"ఆరా? ఇశ్వం మాష్టరుగారు" అని జవాబిచ్చాడు

నేను టేబుల్ మీద వున్న అటెండెన్స్ రిజిస్టరు 'తిరగవేసి చూస్తే 'విశ్వేశ్వరయ్య-సెకండరీ గ్రేడ్ అసిస్టెంట్' అని ఉంది. అతన్ని చూసి 'హెచ్. ఎమ్. అనుకుని గాభరా పడినందుకు కాస్త నొచ్చుకున్నాను.

ఇంతలో సన్నని వ్యక్తి సీడలా కదిలి వచ్చి టేబుల్ మీద తలపాగా, బెత్తం పెట్టి కుర్చీలో కూర్చున్నాడు. క్రమశిక్షణకు విలువనిచ్చే ఉపాధ్యాయులకు ఆరోజుల్లో కేన్ ఒక అలంకారం. ఈయన నిస్సందేహంగా హెడ్‌మాస్టరుగారే అని లేచి నన్ను నేను పరిచయం చేసుకున్నాను ట్రాన్స్ఫర్ ఆర్డరు కాపీ చూపించాను. "కూర్చోండి" అని ఆయన నా కళ్ళలోకి లోతుగా చూస్తూ - "మీ గురించి ఇదివరకే విన్నాను మీలాంటి వారిని వెయ్యమని ఎన్నోసార్లు జిల్లా బోర్డు ఆఫీసులో చెప్పాను. విన్న దెవరు? పోనీలెండి. వాళ్ళు ఇన్నాళ్ళకి ఓ మంచి పని చేశారు" అని అటూ ఇటూ చూసి కాస్తస్వరం తగ్గించి "స్కూలు అస్తవ్యస్తంగా నడుస్తోంది. కాస్త మీలాంటి వారి సహకారం ఉంటే ఒక తాటి మీద నడిపించాలని కోరిక. క్రమశిక్షణ బొత్తిగా లేదు" అన్నాడు.

ఇందులో నన్ను ప్రశంసించినట్లూ, నామీద ప్రత్యేక బాధ్యత మోపుతున్నట్లూ, నా సహకారం ఆశిస్తున్నట్లూ, ప్రస్తుత పరిస్థితులు అసంతృప్తిగా ఉన్నట్లూ చాలా అర్థవంతంగా మాట్లాడారు. ముందుగానే నామీద అయన కున్న సదభిప్రాయానికి నేను కాస్త గర్వపడక పోలేదు.

నేను క్రమంగా స్టాఫ్‌లో ఒకణ్ణయి స్కూల్ వ్యవహారాలు అవగాహన చేసుకుంటున్నాను. ఒక విషయం హెడ్‌మాస్టరుగారిని బాధిస్తున్నదని నాకు అర్థమైపోయింది. సెకండరీగ్రేడ్ టీచరు విశ్వానికి అందిన వినయ విధేయతలు కింది ఉద్యోగుల నుంచి ఆయనకు అందడం లేదు పిల్లల మాట సరేసరి. ఈ విషయం నాక్కూడా కొంత అసహజంగానూ, అసంతృప్తికరంగానూ తోచింది సాధారణంగా ట్రైనియిన్డు గ్రాడ్యుయేట్సుకీ, పోస్టుగ్రాడ్యుయేట్సుకీ సెకండరీగ్రేడ్ వాళ్ళు ఎదురైతే నమస్కరించడం రివాజు. ఆ రివాజు విశ్వం మాస్టరు పాటించినట్లు నాకు ఎన్నడూ కనపడలేదు. వయస్సులో పెద్దని నేను సరిపెట్టుకోబోయినా అతని చర్యలు ఏ సూత్రానికీ కట్టుబడేవి కావని నాకు అనిపిస్తూ వచ్చింది.

తాగేనీటి అవసరాలకు ఏదీ శాశ్వతమైన ఏర్పాటు స్కూల్లో లేదు. ఊరుచివర బావినుంచో, అది ఎండితే చెరువునుంచో బిందెలు నింపుకుని, ఒంటెద్దు బండిమీద నర్సింహులు స్కూలుకు తెచ్చేవాడు. బరంపురం మసాలా కిళ్ళీ బుగ్గలో బిగించి బక్కచిక్కిన నర్సింహులు అంతకన్నా శుష్కించిన ఎద్దును తోలుకుంటూ నానా బూతులూ తిడుతూ వచ్చేవాడు.

"నీ తిట్లు విని నడవడం ఎద్దుకు బాగా అలవాటు చేశావు. అవి లేకుంటే ఒక్క అడుగు ముందుకు వెయ్యదు కదా!" అని రెండో అటెండరు పీరన్న నర్సింహులుని పరిహాసం చేస్తూ ఉంటాడు. చెప్ప వచ్చే దేమంటే, ఎవ్వరిని లెక్క చేసినట్లు కనపడని నర్సింహులు తాగిన మైకంలో జోగుతున్నా సరే విశ్వం మాస్టరు కనపడితే వంగి వంగి నమస్కారం చేస్తాడు.

మెల్ల మెల్లగా ఆ కొత్త వాతావరణానికి నేను అలవాటుపడు తున్నాను. నా ఇద్దరు కొడుకుల్నీ మా స్కూల్లోనే చేర్చాను.

ఆడపిల్ల చంటిది. దొరికిన ఇల్లు కాస్త చిన్నదైనా ఇరుగూ పొరుగూ బాగున్నందుకు తృప్తిపడ్డాను.

ఒక రోజు హెడ్‌మాస్టరుగారు నన్ను పిలిపించి, ప్రత్యేక శ్రద్ధతో అటూ ఇటూ చూసి "మనస్కూల్ లైబ్రరీ విశ్వం టీచరు చాలా కాలంగా చూసుకుంటున్నాడు. మీరు ఒక మారు స్టాక్ బుక్‌తో పుస్తకాలు సరిచూసి ఎలాగో నెల రోజుల్లో ఒక దారిలోకి తీసుకురండి. ఆ తరువాత ఇంకెవరికైనా టీచరుకి ఆ బాధ్యత అప్పగిస్తాను. మిమ్మల్ని ఇబ్బంది పెట్టను. మీరు స్కూల్ ఫైనల్ పిల్లలకు ఒక నెల ముందుగా కోర్సు పూర్తి చేసి రివైజ్ చేయించాలి" అన్నారు.

నేను సరే అని వారం రోజులు కష్టపడి పుస్తకాలు సరి చూసే సరికి తలప్రాణం తోకకు వచ్చింది. ముప్పై పుస్తకాలు ఏమైనట్లో-రికార్డు లేదు. ఈ సంగతి విశ్వం మాస్టర్ని అడిగితే అతి సాధారణ విషయంలా-"ఎవరి దగ్గరనైనా ఉండిపోయాయేమో అడిగి చూస్తాను" అన్నాడు నాకు కాస్త చిరాకు వేసింది. "ఎవరికైనా ఇస్తే రిజిస్టరులో వాళ్ళ పేరు రాసి సంతకం తీసుకోరా" అని అడిగాను.

"పదిహేను ఏళ్ళనుంచి వద్దంటున్నా ఈ బాధ్యత నామీద వేశారు. ఒక చదువుకున్న అటెండర్ని వేయించి వారంలో ఒక్క రోజైనా నాకు కాస్తసహాయం చేసే ఏర్పాటు చెయ్యమని అడిగాను. నా మాట ఎవ్వరూ పట్టించుకోందే! మూడు వేల పుస్తకాల్లో ముప్పై పుస్తకాలు కనపడకపోతే అంత గాభరా పడిపోతే ఎలాగండి బాబూ! హెడ్‌మాస్టరుగారూ, సీనియర్ అసిస్టెంట్లూ అప్పుడప్పుడు క్లాసులో పాఠం చెప్తూ ఏదైనా పుస్తకం కావాలని అడగడం - నేను పంపడం

జరుగుతుంది. ఎక్కడ సంతకం తీసుకోను?" అంటూ కుడి బుగ్గనున్న మసాలా కిళ్ళీ ఎడమ బుగ్గకు మార్చి నెమ్మదిగా సమాధానమిచ్చాడు.

ప్రతిదీ తేలికగా తీసుకునే స్వభావం విశ్వం మాస్టరుది అని ఒక అభిప్రాయం నాలో చోటు చేసుకుంది. ఒక వారం రోజుల తరువాత ఎవర్ని అడిగి తెచ్చాడో కానీ ఓ పది పుస్తకాలు ఇచ్చాడు. ఇక ఇవ్వడానికి అతనికి సాధ్యపడినటులేదు. ఒక ఇరవై పుస్తకాలు మినహాయించి మిగతా పుస్తకాలు స్టాకు బుక్‌తో సరితూగి ఉన్నాయని రిపోర్టు రాసి హెచ్. ఎమ్ గారికి అందించాను. ఆ తరువాత లైబ్రరీ బాధ్యత తెలుగు టీచరు కుమారస్వామికి ఇచ్చినట్లు నాకు తెలిసింది.

ఒక రోజు నేను స్టాఫ్ రూమ్‌లోకి నెమ్మదిగా వెళ్తూ ఉంటే సైన్స్ అసిస్టెంట్ - "ఏం విశ్వం మాస్టరుగారూ, మెల్లిగా లైబ్రరీ బాధ మీకు తప్పినట్లుం"దని ఏదో ఛలోక్తిగా అంటూ నన్ను చూసి ఆ సంభాషణ అక్కడితో ఆపివేశాడు.

హెచ్. ఎమ్. కి నేను చేరువౌతున్న కొద్దీ కొందరు స్టాఫ్ మెంబర్లకు దూరమౌతున్నానన్న భావన నాలో కలిగింది. ఆమాత్రం రాజకీయాలు ఎక్కడైనా ఉంటాయని నాకు నేని సర్ది చెప్పుకున్నాను. అయినా విశ్వం మాస్టరుది అంతా బుకాయింపూ, దబాయింపూ వ్యవహారం తప్ప ఒక లైబ్రరీని పద్ధతిగా నడపడం ఏమంత కష్టం. అని కూడా అనుకున్నాను. నాలో ఉన్న ఈ అభిప్రాయాన్ని కొన్ని సంఘటనలు బలబరుస్తూ వచ్చాయి.

ఒక వారం రోజులు నేను ఇన్‌ఛార్జిగా ఉన్నాను. హెచ్.ఎమ్. గారు లీవులో ఉన్నారు.

"మీరు ఆలస్యంగా వస్తే పిల్లల్ని ఎలా అడగగలం?" అని విశ్వంని మందలించాను. "నేను కోరి ఆలస్యంగా రాను - ఏదో ఊహించని కారణంతో వేళకు రాలేకపోతూ ఉంటాను" అని చెప్పి స్టాఫ్ రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

ఆ మాటల్లో కోపమూ లేదూ—అడిగినందుకు బాధా లేదు—వ్యంగ్యం అంతకన్నా లేదు. ఇక నేను వాగ్వాదం పెంచలేదు. తరువాత ఒకసారి హెడ్‌మాస్టరుగారు నాతో విశ్వం ఆలస్యంగా వస్తూ ఉంటాడని ప్రస్తావించినప్పుడు కాస్త ఆశ్చర్యం వేసింది. వారం రోజులు ఇన్‌ఛార్జిగా ఉన్న నేనే ఒకమారు విశ్వాన్ని మందలించాను కదా స్కూల్‌కి పెద్ద అయినవారు ముఖాముఖీగా ఎందుకు అడగరో నాకు తెలియలేదు.

అప్పటికి నాకు ఏర్పడిన చనువుతో — "పోనీ అతన్ని ట్రాన్స్‌ఫర్ చేసే ప్రయత్నం చెయ్యలేకపోయారా?" అని అడిగాను. హెడ్‌మాస్టరు గారు బాధగా ముఖం పెట్టి—"ప్రయత్నం చెయ్యక పోలేదు. ట్రాన్స్‌ఫర్ ఆర్డర్సు కూడా వచ్చాయి. విచిత్రంగా రెండు రోజుల్లో అవి కాన్సిల్ అయినాయి. నేను ట్రాన్స్‌ఫర్ ప్రయత్నం చేశాను కనుక నాకు ఒక విధంగా అది అవమానంగా తోచింది. విశ్వం శిష్యులెవరో డిస్ట్రిక్ట్ బోర్డులో ఉన్నారని తరువాత తెలిసింది. ఇక వివాదపడకుండా మొదటి పీరియడ్ అతనికి లేకుండా, వర్క్ షెడ్యూల్ మార్చాను. అతని సహచరులూ, స్నేహితులూ ఉట్టి జూదరులూ, బుడ్డీ రాయుళ్ళూ" అన్నారు ఏవగించుకుంటూ హెడ్ మాస్టరుగారు

ఇంకో సందర్భంలో వారే కాస్త స్వరం తగ్గించి మరో విషయం చెప్పారు నాకు. గత వార్షిక పోటీలకు స్కూల్ టీమ్స్‌ని తీసుకుని

పై ఊళ్ళు వెళ్ళవలసి వచ్చినప్పుడు, పిల్లలందరూ విశ్వం మాస్టర్ని పంపమని కోరితే పంపించారట టీమ్స్‌కి మేనేజరుగా. ఖర్చుల లెక్క అప్పగించవలసి వచ్చినప్పుడు పన్నెండు రూపాయలు చిల్లర ఖర్చుగా చూపించాడట.

"వోచర్లు లేకపోతే ఎలాగండీ?" అని అడిగితే "మన వాలీబాల్, బాడ్‌మింటన్ టీములు ఫైనల్స్‌లో గెల్చిన ఆనందంలో ఆవోచర్లు ఎక్కడో పడేసుకున్నాను. ఇంత రాద్ధాంతం చేస్తే ఎలాగండీ?" అని తేలికగా జవాబు ఇచ్చాడట. అప్పటి రోజుల్లో పన్నెండు రూపాయలు తక్కువ మొత్తంకాదు.

ఇవన్నీ విన్నాక విశ్వం మాస్టరు అంటే ఒక రాజకీయ చతురుడుగా, పిల్లల్ని తన చుట్టూ తిప్పుకునే ఇమేజి బిల్డరుగా నా మనసులో రేఖాచిత్రం గీసుకున్నాను. ఇదే సమయంలో నేనొక దురదృష్టమైన సంఘటనలో ఇరుక్కున్నాను.

ఒక మధ్యాహ్నం లెక్కలు హోమ్‌వర్కు చేసుకురాలేదని చెయ్యని వాళ్ళందరికీ బెత్తంతో తలో దెబ్బ అరచేతిమీద వేశాను. అందులో ఒకడు తరచూ హోమ్ వర్క్ ఎగవేస్తూ ఉంటాడన్న కోపంతో కాస్త గట్టిగానే వేశాను. ఆ వెధవ అరచేతిలో మానుతూ ఉన్న పుండు ఉంది. అది చిట్లి కాస్త రక్తం చిమ్మింది. మనస్సు చివుక్కుమన్నా గంభీరంగా ముఖం పెట్టి "ఇంకెప్పుడూ హోమ్‌వర్క్ ఎగవెయ్యకు" అంటూ క్లాసు నడిపించి వదిలేశాను.

సుడిగాలిలా వచ్చి పడిందో ఆడమనిషి ఎలా తెలిసిందో ఈ వార్త! ఆమె ముఖంలో ఏదో ఆకర్షణ ఉన్నా మాటలో సంస్కారం పూజ్యం. ఆమె వెనుక ఇంకో ఇద్దరు ఆడవాళ్ళు కూడా ఉన్నారు. తిట్టిన తిట్టు తిట్టకుండా తాటకిలా రెచ్చిపోయింది.

అనుకోని ఈ సంఘటనతో అవాక్కయిపోయి, తేరుకుని- "పుండుని చూడలేదు. అలా పిల్లల్ని వెనకేసుకొస్తే పాడయిపోతారు" అన్నాను.

"ఇలా రక్తం వచ్చినట్లు కొట్టు. నిన్ను నెత్తిన పెట్టుకుంటారు" అని ఏకవచన ప్రయోగం చేసింది.

నాకు ఏడుపు ఒకటే తక్కువ, దగ్గర్లో ఉన్న వీరన్నను కేక వేశాను. వాడి వశం కూడా కాలేదు ఆమె నోరు మూయించడం. పిల్లలంతా వచ్చి మూగిపోయారు.

ఇక వేరు మార్గంలేక వీరన్న విశ్వం మాస్టరుని పిలుచుకుని వచ్చాడు. అతను వస్తూనే పిల్లవాడిని దగ్గరకు తీసుకుని రక్తం చిమ్మిన చేతిని తన చేతిలోకి తీసుకుని "సావిత్రీ, ఏదో పొరపాటు జరిగింది. నువ్వు నా మాట విని వెళ్ళిపో. వీడికి ఆసుపత్రిలో మందు వేసి, కట్టు కట్టించి పంపుతాను" అంటూ స్కూలు వెనకనే ఉన్న గవర్నమెంట్ ఆసుపత్రికి కుర్రవాణ్ణి తీసుకుని వెళ్ళిపోయాడు.

సావిత్రి నీళ్ళు జల్లిన నిప్పులా చల్లబడి కన్నీళ్ళు తుడుచుకుంటూ పోయింది. ఆ పసివాడు ఎంతో చనువుగా విశ్వం వెనకనే వెళ్ళి పోయాడు ఏడుపు లేకుండా. ఆ క్షణానికి నేను బ్రతుకుజీవుడా అనుకున్నా తరువాత వారం రోజులవరకూ తలుచుకు తలుచుకు క్రుంగిపోయాను. కొత్త ప్రదేశం. అందరి ముందూ నా ప్రతిష్ఠ దెబ్బతినడం ఒక్కటే కాదు దానికి కారణం. నేను ఏవగించుకుంటున్న విశ్వం నాకు రక్షకుడై నిలవడం, చెడుకాలం విశ్వం మాస్టరుతో కలిసి నామీద కుట్ర చేసిందా అనుకున్నాను.

ఒక ఆదివారం పిల్లలు రాసిన పరీక్ష పేపర్లు దిద్దుకుంటున్నాను. వాళ్ళ చేవ్రాలులో ఉన్న వైవిధ్యానికి ఆశ్చర్యపోతున్నాను కొందరు కుర్రాళ్ళు ఎంతో శ్రద్ధగా స్కేల్‌తో మార్జిన్లు గీసి, లైన్లు కొట్టుకుని రాస్తున్నారు. కానీ పంక్తినీ పంక్తినీ కలగాపులగం చేసి, మార్జిన్ దాటి రాస్తున్నారు. ఒకళ్ళిద్దరు ఏ మార్జిన్లూ, లైన్లూ లేకుండానే కంటితో అంచనా వేసుకుని ముత్యాల కోవలా పంక్తులు రాస్తున్నారు. ఇది వాళ్ళలో ఉన్న సహజమైన కళా, లేక సాధకంతో వచ్చిన దస్తూరీయా- అని నాలో నేనే ప్రశ్న వేసుకుంటున్నాను. నా భార్య కలవరపడుతూ పనిమనిషి ద్వారా విన్న వార్త నా చెవిన వేసింది. పెద్దమ్మవారు ఊళ్ళోకి వచ్చిందట.

అప్పట్లో మశూచిని ఆ ప్రాంతంలో పెద్దమ్మవారు అనేవారు. ఇప్పుడు ఆ వ్యాధి నిర్మూలమైనా అప్పుడు అతి భయంకరంగా ప్రజల్ని గజగజలాడించేది. ఆ ఊరి సంప్రదాయం ప్రకారం నా భార్య గ్రామ దేవత సురమంగళమ్మకు ఏదో ఉపారం కూడా పంపించింది.

ఆ మరునాడు హెడ్‌మాస్టరుగారు స్కూల్‌కి రాలేదు. సెలవు చీటి వచ్చింది. వారి భార్యకూ, నిండు చూలాలైన కూతురికీ మశూచి వచ్చి ఒత్తుగా కవచం తొడిగినట్లు కుండలు పోసిందని తెలిసింది.

మా వీధిలో ఉన్న సైన్స్ అసిస్టెంట్‌ని కలిసి "హెచ్.ఎమ్. గారి ఇంటికి వెళ్ళాలి వస్తారా పోదాం?" అన్నాను.

ఆయన 'సరే' అని అనలేదు. ఏదో పని ఉందని తప్పుకున్నాడు. నా భార్య నా ప్రయత్నం విని మందలించింది. "పిల్లల వాళ్ళం" అన్నది. సైన్స్ అసిస్టెంట్‌కి నాకు వచ్చిన ప్రతిఘటనే ఇంట్లో ఎదురై

ఉంటుందని అప్పుడు అనుకున్నాను. నేను వెళ్ళకపోయినా మనసులో చాలా గిల్టీగా ఫీల్ అయ్యాను.

ఇంతలో రెండు రోజుల తరువాత ఒక రాత్రి ఘోరమైన వార్త. హెచ్ ఎమ్. గారి భార్యా కూతురూ ఒక్క రోజే చనిపోయారని. ఈ వార్త అందర్నీ కదిపివేసింది. మర్నాడు ఉదయం తెగించి నేను ఒక్కడినే బయలుదేరాను హెడ్‌మాస్టరుగారు ఏడ్చే శక్తిలేక కుప్ప కూలిపోయి ఉన్నారు. మృతదేహాలు దూరం నుంచి చూడడానికే భయం కరంగా ఉన్నాయి. మశూచి వచ్చిన వాళ్ళని దహనం చెయ్యకూడదని ఒకరూ, చెయ్యవచ్చని ఒకడూ ఏదో మీమాంస పడుతున్నారు ఒక రిద్దరు. అక్కడ ఉన్న వాళ్ళంతా కలిపి గట్టిగా పదిమంది లేరు. వాళ్ళలో దీర్ఘంగా ఆలోచిస్తూ నిలుచున్న విశ్వం మాస్టరుని చూసి ఆశ్చర్యపోయాను.

"నర్సింహులూః" అని పిలిచిన విశ్వం కేకకు "హుజూర్" అన్నట్లు వచ్చి నిలుచున్నాడు. విశ్వం ఏదో చెవిలో నెమ్మదిగా చెప్ప గానే, అక్కడినుంచి కదలి పది నిముషాల్లో నర్సింహులు తిరిగి వచ్చాడు.

"బాబూ, రెండెడ్లబండి తీసుకొని కోనారి వచ్చాడు" అని చెప్పి, కాగితం చుట్టిన ఒక కిళ్ళీని కూడా విశ్వం చేతిలో పెట్టాడు. ఆ క్షణంలో రాముడి ఆజ్ఞకు నిలబడ్డ హనుమంతుడిలా ఉన్నాడు నర్సింహులు.

విశ్వం మాస్టారు కిళ్ళీ బుగ్గను పెట్టి పంచ ఎగగట్టి అలా శవాల వేపు వెళ్తూ ఉంటే నర్సింహులు మంత్రించినట్లు వెనకాలే వెళ్ళాడు.

వీళ్ళ ఇద్దర్నీ చూసి ఇంకో వ్యక్తి ఎవరో ధైర్యంగా ముందుకు వచ్చాడు. వాళ్ళు ఆ మృతదేహాలు ఎత్తి బండిలో వేసుకుని కర్మయోగుల్లా మాట్లాడకుండా, గంభీరంగా శ్మశానం వేపు సాగిపోయారు. నన్ను నానా తిట్లూ తిట్టిన సావిత్రి అక్కడ స్థలాన్ని బిందెలతో నీళ్ళు గుమ్మరించి కడిగేసింది. నేను కళ్ళు అప్పగించి చూస్తూ ఉండిపోయాను హెడ్‌మాస్టరుగార్ని ఎలా పరామర్శించాలో తెలియక ఏదో నాలుగు మాటలు చెప్పి ఇంటిదారి పట్టాను.

కాసింత దూరన ఉన్న పెద్దమనిషిని—"విశ్వం మాస్టరుకి పిల్లలున్నారా?" అని అడిగాను. అప్పుడు ఆ ప్రశ్న అప్రస్తుతమే కానీ నా ఆలోచనల్లో పైపైన తేలుతున్న ఆ ప్రశ్న అనాలోచితంగా బయట పడింది. "ఎందుకు లేరు బాబూ ఆరి ఇంటినిండా పిల్లలూ పాపలే" అన్నాడత నెవరో.

తరువాత రోజు ఉదయం స్కూల్లో మొదటి పీరియడ్ అయిన గంట కొట్టారు: నేను క్లాసురూమ్ నుంచి స్టాఫ్ రూమ్‌లోకి పోబోతున్నాను. రోజూ తూర్పున సూర్యుడు ఉదయించినంత సాధారణంగా, ప్రశాంతంగా విశ్వం మాస్టరు నాకు ఎదురుగా ఏదో పుస్తకం పట్టుకుని వెళ్ళిపోతున్నాడు. నా రెండు చేతులూ అప్రయత్నంగా లేచి కలుసుకుని (ఏకవచన ప్రయోగం ఆనాడే మానుకున్నాను) విశ్వం మాస్టరుగారికి నమస్కరించాయి. ఈ సత్కారానికి అలవాటుపడని మాస్టారు చూసుకోకుండా ముందుకు సాగిపోయారు.

నేను వారం రోజులు హెచ్ ఎమ్. గారి గదిలో కూర్చుని పని చేయవలసి వచ్చింది. అల్మరా వెనుక పేరుకున్న కొన్ని న్యూస్ పేపర్లూ అవీచూస్తూ ఉంటే - నాలుగు లైబ్రరీ పుస్తకాలు కనిపించాయి

దీంతో నాకు విశ్వం మాస్టరుగారి మీద ఉత్సుకత పెరిగింది. రెండు ప్రశ్నలు నన్ను వేధిస్తున్నాయి. అందరిలో ముసలివాడైన దాలయ్యను పిలిచి నెమ్మదిగా - "ఆ తాగుబోతు నర్సింహులు ఎవర్నీ లక్ష్యపెట్టడు కదా, ఆ విశ్వం మాస్టరుగార్ని, ఎందుకలా వంగి వంగి గౌరవిస్తాడు?" అని అడిగాను.

"నర్సింలు పెళ్ళి పెడాకూ చేసుకోనేదు బాబూ, ఆడి సంపాదనలో తాగింది తాగి మిగిలే చెల్లెలు సాయిత్రికి ఇస్తాడు. అది ఏం వండిపెడితే అది తింటాడు. ఓ రోజు బరువు బండిని తోలుకుని, ఇస్కూలు గేటు కాడికి వచ్చాడు బాబూ. ఆడ దిగి, నడిపించుకు వస్తుంటే ఎద్దు బెదిరింది. బండి చక్కరం గుంతలోకి గుంజింది. బండి అమాంతం నర్సింలు మీద పడిపోనాది. ఆడు చావుకేక పెట్టాడు. ఆడ ఓరూ లేరు. ఇశ్వంమాస్టరుగారు అప్పుడే వస్తున్నారు. గబాల్న పోయి ఒంగి, బండిని ఆరి వీపుమీద లేపి నర్సింలుమీద బరువు మోపకుండా రచ్చించారు. అప్పుడు కదా నానూ కొందరు ఇస్కూలు పిల్లలూ ఉరికి నర్సింలునీ, ఇశ్వం గోరినీ ఇడిపించాం ఆ రోజు నుంచీ ఆడికీ, ఆడి చెల్లెలు సాయిత్రికి ఆరంటే దేవుడే. మా కందరికీ ఆరంటే చానా ఇష్టం బాబూ" అన్నాడు దాలయ్య.

వాడి మాటల్లో సావిత్రి ఎవరన్న నా రెండవ ప్రశ్నకూ జవాబు ఉంది.

నిష్ఠతో నాబోటివాళ్ళు ఆచరించే క్రమశిక్షణలూ, పద్ధతులూ విశ్వంగారికి సాధ్యం కావు. కానీ వారు చెయ్యగల పనులు మాకు ఊహాతీతం. మేంనడిపే స్కూళ్ళు నాలుగు గోడలకే పరిమితం. అందులో క్రమశిక్షణ ఒక మార్గం. విద్యార్జన ఒక పరమ లక్ష్యం.

కానీ విశ్వం మాస్టరుగారి బడి ఈ విశ్వమంత విశాలం. అందులో సావిత్రీ, నర్సింహులు, దాలయ్యల వంటి అతి సామాన్యులూ, నాలాంటి డబుల్ ఎమ్మేలూ కూడా సహపంక్తిలో కింద కూర్చుని ఓనామాలు దిద్దుకోవలసిందే. క్రమశిక్షణలూ, దాంతో వచ్చే చదువులూ కూడా ఇంకో పరమార్థానికి మార్గాలు మాత్రమే అన్నది విశ్వంగారి పాఠాల్లో అంతరార్థంగా నాకు తోచింది. అందుకే ఆ రోజు నుంచీ నేనూ పలకా, బలపం పట్టుకున్నాను.

ఏనాటి ముచ్చట లివి! ఈవేళ ఉదయం "కర్మయోగులు అంటే ఎవరు తాతయ్యా?" అని నా మనవరాలు ఏదో పుస్తకం తిప్పుతూ నన్ను అడగకపోతే ఈ విషయాలు మననం చేసుకునేవాణ్ణి కాదు.

మనిషి మనసులో పడి ఉన్న జ్ఞాపకాల పొరలు ఎంత బలమైనవో!

—ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 26-4-89